సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 5 । జనవరి । 2024



మఠం.. ఉత్సవ శోభితం

బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆరాధనోత్సవాల్లో ఈశ్వరీదేవికి విశేష పూజలు చేశారు.

-8లో



గాలికుంటు నివారణకు టీకాస్త్రం

పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం ఈనెల 2వ తేదీ నుంచి ప్రారంభమైంది.

-8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.6 /22.2

జిల్లాలో గురువారం 22.2 - 29.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6న హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: టి. సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికలు (అండర్-19) విభాగం ఎంపికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి. లక్ష్మణ్ తెలిపారు. 2004 నుంచి 2008 సంవత్సరాల మధ్యలో పుట్టిన క్రీడాకారులు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

6న జిల్లాస్థాయి హాకీ జట్టు..

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 6వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి హాకీ జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హాకీ కడప అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు ఎ. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి 1 తర్వాత పుట్టిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌లు తీసుకురావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలుర హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

7న బండలాగుడు పోటీలు

కడప కల్చరల్: కడప రెడ్డిసేవా సమితి సంక్రాంతి సంబరాలు-2024లో భాగంగా ఆదివారం కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ప్రతినిధి పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. ఈ పోటీలో దాదాపు 20 జతల ఎద్దులు పాల్గొంటాయన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 1,00,000, ద్వితీయ బహుమతి రూ. 75,000, తృతీయ బహుమతి రూ. 50,000, ప్రోత్సాహక బహుమతులుగా రూ. 30,000, రూ. 20,000, రూ. 15,000, రూ. 10,000 ఇవ్వనున్నట్లు వివరించారు. పోటీలో పాల్గొన్న వారందరికీ రూ. 5000 చొప్పున ప్రోత్సాహక బహుమతి ఇస్తామన్నారు.

వేంపల్లె వాసి ప్రతిభ



పి.భరద్వాజ్‌రెడ్డి

వేంపల్లె: వేంపల్లె పట్టణానికి చెందిన పి.భరద్వాజ్ రెడ్డి అనే విద్యార్థి ప్రతిభ కనబరిచి తమిళనాడు రాష్ట్రం మధురై ప్రభుత్వ రాజాజీ మెడికల్ కళాశాలలో డీఎం నియోనటాలజీ సీటు సాధించారు. వేంపల్లెకి చెందిన రాజగోపాల్‌రెడ్డి, సుజాతల కుమారుడు డాక్టర్ భరద్వాజ్‌రెడ్డి ఎంసెట్‌లో 1215వ ర్యాంక్ పొందాడు. కడప రిమ్స్‌లో మెడికల్ సీటు సాధించి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలలో ఎండీ పీడియాట్రిక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ నీట్‌లో ఆలిండియా 168వ ర్యాంక్ సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రైవింగ్ స్కూలులో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 18 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం 19వ బ్యాచ్ శిక్షణకు ఆసక్తిగల వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. డ్రైవింగ్‌తోపాటు బస్సు విడిభాగాలు, ఇతర అంశాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 99592 25774, 73828 61545 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో డిసెంబర్ నెలలో నిర్వహించిన బీటెక్ మొదటి, రెండో, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.సూర్యనారాయణరెడ్డిలు తెలిపారు. కొద్ది సమయంలోనే ఫలితాలు విడుదల చేసినందుకు పరీక్షా కేంద్ర విభాగాధిపతులు హుస్సేన్‌వలి, ఎం.సాంబయ్యలకు అభినందనలు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్ వీరయ్య

మైదుకూరు: మైదుకూరులోని వినాయకనగర్‌కు చెందిన సుబ్బరాయుడు అనారోగ్యంతో బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఇంటికి రాలేని పరిస్థితిలో ఉన్నందున ఈనెల వృద్ధాప్య పింఛన్ మొత్తాన్ని వలంటీర్ కె.వీరయ్య బెంగళూరు వెళ్లి అందించారు.ఈసందర్భంగా వీరయ్యకు సుబ్బరాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నతి.. ఆర్థిక ప్రగతి



నా పేరు పొరెడ్డి మాధవి. పెద్దముడియం మండలం నెమ్మళ్లదిన్నె. మా సంఘం పేరు మైథిలి ఎస్‌హెచ్‌జీ. సున్నా వడ్డీ కింద సంఘానికి ప్రభుత్వం తోడ్పాటు అందించింది. ఆ మొత్తంతో కిరాణా షాపు నడుపుతున్నాను.వ్యాపారం బాగా జరుగుతోంది. మరింత ఆదాయం పెంచుకునేందుకు కృషి చేస్తున్నాం.



నా పేరు జి.సరస్వతి. జమ్మలమడుగు మండలం దేవగుడి. మా సంఘం పేరు కాశిరెడ్డినాయన. సంఘానికి నాలుగు విడతల్లో సున్నా వడ్డీ మొత్తం రూ. 65,600 వచ్చింది. నా వాటాగా రూ. 8200 అందింది. చిన్నపాటి దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాను.దీంతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఏర్పడింది.



- 'సున్నా'వడ్డీతో సుస్థిర జీవనోపాధి
- ఇప్పటివరకు జిల్లాలో నాలుగు విడతలకు రూ. 187.5 కోట్లు
- జిల్లాలో 3,49,569 మంది ఎస్ఎహెచ్‌జీ మహిళలకు ఆర్థికాభివృద్ధి

కడప సిటీ: మహిళల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. వారి ఉజ్వల భవిష్యత్తుకు వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో ఉన్న పేద మహిళల ఆర్థిక పురోగతికి ఈ పథకం దోహదపడుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు విడతలుగా 3,49,569 మంది అర్హులైన ఎస్‌హెచ్‌జీ మహిళలకు సున్నా వడ్డీ కింద రూ. 187.5 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో తమ జీవన ప్రమాణాలను పెంచుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తున్నారు. సున్నా వడ్డీ మొత్తంతో తమకు అనుభవం ఉన్న రంగంలో దుకాణాలను ఏర్పాటు చేసుకుని కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

అర్హత ఇలా..

ఈ పథకాన్ని ప్రభుత్వం 2020 ఏప్రిల్ నుంచి ప్రారంభించింది. ఇప్పటికి నాలుగు దఫాలుగా అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీని నేరుగా వారి తరఫున బ్యాంకులకు ప్రభుత్వం చెల్లించింది. సకాలంలో వాయిదా చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తిస్తుంది. క్యాష్ క్రెడిట్ లిమిట్ ద్వారా అప్పు పొందిన సంఘాలు ప్రతినెల గత నెలాఖరు నాటికి ఉన్న అప్పు నిల్వలో కనీసం మూడు శాతం ప్రస్తుత నెలలో చెల్లించి ఉండాలి. సంఘం అప్పు నిల్వలో రూ. 3 లక్షల వరకు సున్నా వడ్డీ వర్తిస్తుంది. ఒకవేళ టర్మ్ లోనైతే ఏ నెలలో ఎంత ఈఎంఐ చెల్లించాలో అంత ఆ నెలాఖరు నాటికి చెల్లించి ఉండాలి. వైఎస్సార్ సున్నా వడ్డీ అర్హతను ప్రతినెల ధృవీకరించి లెక్కిస్తారు. సంఘాలు బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాత మాత్రమే సున్నా వడ్డీకి అర్హత పొందుతాయి. వైఎస్సార్ సున్నా వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా స్వయం సహాయక సంఘం అప్పు ఖాతాకు జమ చేస్తారు. ఒకవేళ అప్పు ఖాతా క్లోజ్ అయితే సంఘం పొదుపు ఖాతాకు జమ చేస్తారు.

వడ్డీ రేట్లు తగ్గింపు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో వడ్డీ తగ్గింపు విషయంపై చర్చలు చేపట్టారు. స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్న బ్యాంకు రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే విధంగా వారితో మాట్లాడారు. 13.50 శాతం నుంచి 9.50 శాతానికి వడ్డీరేటును తగ్గించడం జరిగింది. దీనివల్ల చాలా సంఘాలు లబ్ధి పొందేందుకు అవకాశం ఏర్పడింది.

సున్నా వడ్డీని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ మహిళలకు అందిస్తున్న వైఎస్సార్ సున్నా వడ్డీతో ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తున్నారు. అర్హులకు ఈ పథకం వరం లాంటిది. రుణాలు సకాలంలో చెల్లించి సున్నా వడ్డీని పొందాలి. పథకాన్ని సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాన్ని పెంచుకోవాలి.

– ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ, కడప

నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీకి సంబంధించిన వివరాలు

నియోజకవర్గం	రుణాల సంఖ్య	లబ్ధిదారులు	మొత్తం
బద్వేలు	4726	48313	5,68,58,919
జమ్మలమడుగు	4209	42833	5,87,11,598
కమలాపురం	4770	48633	6,64,88,461
మైదుకూరు	4595	46758	5,88,95,169
ప్రొద్దుటూరు	2832	29003	3,45,86,704
పులివెందుల	4415	44909	6,36,33,377
రాజంపేట	1463	14999	2,01,24,906



ఒకటి, రెండు, మూడు విడతల్లో లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
బద్వేలు	12,369	24.56
జమ్మలమడుగు	11,299	24.04
కమలాపురం	13,350	29.07
మైదుకూరు	13,145	21.87
ప్రొద్దుటూరు	7423	13.96
పులివెందుల	12,108	29.49
రాజంపేట	4067	7.87

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ



బహుమతి పొందిన విజేతతో డీఈఓ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి తదితరులు

కడప ఎడ్యుకేషన్: అంధులకు అక్షర జ్ఞానాన్ని తెచ్చిన మహనీయుడు, వారి పాలి ఆరాధ్యదైవం లూయిస్ బ్రెయిలీ అని డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిషోర్ పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం కడప శంకరాపురంలోని అంధుల పాఠశాలలో ఏపీ రాష్ట్ర రాయల్ అంధుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.ముందుగా అతిథులు బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆ మహానుభావుడు కనిపెట్టిన లిపి కారణంగా నేడు ఎంతోమంది అంధులు ప్రయోజకులయ్యారన్నారు. కడపలోని అంధుల పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మానసిక సామర్థ్యానికి అంగవైకల్యం అడ్డురాదని బ్రెయిలీ నిరూపించారని అన్నారు. కంప్యూటర్‌భాషకు అనుగుణంగా బ్రెయిలీ లిపి ఉందన్నారు. దీనిని బట్టి బ్రెయిలీ ముందు చూపు ఎంతో అర్థమౌతుందన్నారు. వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో చాలామంది దివ్యాంగులకు కోట్లాది రూపాయలు వెచ్చించి పరికరాలను అందించామన్నారు. పాఠశాల హెచ్ఎం శంకరయ్య మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు దాతలు రవీంద్రారెడ్డి, ఉమావర్ధిని, శ్రీనివాసులు, శ్రీలక్ష్మిల సహకారంతో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర రాయల అంధుల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, కోశాధికారి రాజా, జాయింట్ సెక్రటరీ బాస్కర్, ఉపాధ్యక్షులు చౌడమ్మ, హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో గురువారం రాయచోటి దేవాదాయశాఖ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.7,07,545 ఆదాయం వచ్చినట్లు డ్డెమ్మకొండ చైర్మెన్ నరసింహారెడ్డి, ఈవోమంజుల తెలిపారు.నాలుగునెలల కాలానికి సంబంధించి అమ్మవారికి వివిధ కానుకల ద్వారా 56 గ్రాముల బంగారు, 500 గ్రాముల వెండి వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మల్లెల వెంకటేష్, నక్కామధుసూధన్, భాగ్యమ్మ, సిబ్బంది బాలకృష్ణ, వెంకటరమణ,మహేష్‌లు పాల్గొన్నారు.

కడప వన్‌టౌన్ ఎస్ఐ బదిలీ

కడప అర్బన్: వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్ఐలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేశారు. కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులను నిర్వహిస్తున్న జి. మధుసూదన్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా సుండుపల్లి ఎస్ఐగా బదిలీ చేశారు.


8న రాజంపేటలో అప్రెంటీస్ మేళా

రాజంపేట టౌన్: రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8వ తేదీ ఉదయం పది గంటల నుంచి ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కే.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అప్రెంటీస్‌ను కల్పిస్తారని తెలిపారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు టెన్త్, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలని తెలిపారు.

చెల్లని రూకలే మహా భాగ్యం



సి.రామచంద్రయ్య



జి.ద్వారకనాథరెడ్డి

- అవకాశవాదానికి ప్రతిరూపం సీఆర్సీ
- ఉనికి కోసం తాపత్రయపడుతున్న ద్వారకా
- అధిష్టానం వైఖరిపై తెలుగుతమ్ముళ్ల మండిపాటు

సాక్షి ప్రతినిధి, కడప: చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే ఆ ఇద్దరు 30 ఏళ్ల కిందట ప్రత్యక్ష రాజకీయ క్షేత్రంలో పోటీపడ్డారు. మూడు దశాబ్దాలుగా పరాన్నజీవులుగా రాజకీయాల్లో నెట్టుకొస్తున్నారు. వారిని తెలుగుదేశం అధిష్టానం తెరపైకి తెచ్చింది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు లేని నాయకులను అంటగట్టడంపై మాకు ఇదేం ఖర్మ బాబు అనడం జిల్లాలో తెలుగుతమ్ముళ్ల వంతు అయింది. చెల్లని రూకలే మహా ప్రసాదంగా తెలుగుదేశం పార్టీ భావిస్తుండగా, శిరోభారమని టీడీపీ శ్రేణులు అంటున్నాయి.

- చెన్నంశెట్టి రామచంద్రయ్య తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కడప అసెంబ్లీ నుంచి 1985 ప్రత్యక్ష ఎన్నికల్లో తలపడి గెలుపొందారు. 1989లో జనరల్ ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్‌కు, 1991 ఉప ఎన్నికల్లో కడప పార్లమెంట్ అభ్యర్థిగా తలపడి ఓడిపోయారు. తర్వాత ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ పరోక్ష రాజకీయాల్లో నెట్టుకొచ్చారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నేతగా కొనసాగారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు. రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా ఎంపియ్యారు. అయినప్పటికీ 2008లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అనేక పదవులతో సత్కరించిన టీడీపీ పట్ల విశ్వాసం, విధేయతతో ఉండాల్సిన సీఆర్సీ ప్రజారాజ్యంలో, అక్కడి నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ కూడా ఎమ్మెల్సీ దక్కించుకొని మంత్రి పదవిని చేజిక్కించుకున్నారు. 2018లో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఇలా పార్టీలు మారుతూ వచ్చి అవకాశవాదిగా సీఆర్సీ ముద్ర వేసుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వయోభారంతో నెట్టుకొస్తున్న ఈదశలో ఆయన పార్టీ మారి అనైతికతకు నిలువెత్తు నిదర్శనంగా ఉండిపోయారని పలువురు కాపు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

నాడు వైఎస్సార్ దీవెనలతో..

వ్యాపార వ్యవహారిక కార్యక్రమాల్లో ఉన్న గడికోట ద్వారకనాథరెడ్డి 1994లో ప్రత్యక్ష రాజకీయాల్లో ఆరంగ్రేటం చేశారు. అప్పటి వర్గ రాజకీయాల ఫలితంగా మాజీ మంత్రి ఆర్ రాజగోపాల్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్గీయులు పనిచేశారు. వైఎస్సార్ చల్లని దీవెనలతో ద్వారకా లక్కిరెడ్డిపల్లె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత టీడీపీ ఛీ కొట్టింది. 1999లో టికెట్ నిరాకరించింది. తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ప్రతిసారి ఎన్నికలకు ముందు ఉనికి చాటుకోవాలనే తపనతో తెరపైకి రావడం ద్వారకాకు సర్వసాధారణమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తాజాగా టీడీపీ కండువా కప్పుకోవడం విశేషం.

టీడీపీకి కొత్త తలనొప్పి

రాయచోటి టీడీపీ అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు ఆశిస్తున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి వచ్చి చేరారు. ఇప్పటికే అనైక్యతతో కొట్టుమిట్టాడుతున్న నేతల మధ్యలోకి ద్వారకా రావడం కొత్త తలనొప్పి తెచ్చిపెట్టినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేరు చెప్పుకొని వెలుగొందిన ద్వారకా వైఎస్సార్‌సీపీకి దూరం కావడం వెనుక అవకాశవాదం ఉన్నట్లు పరిశీలకులు దెప్పిపొడుస్తున్నారు. సీఆర్సీ,ద్వారకాలు చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే రకమని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆర్టీసీలో 'పెద్ద పండుగ' సందడి!

- ప్రయాణికుల సేవకే ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం
- సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులు
- సాధారణ చార్జీలతో ప్రయాణం



కడపలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగ దగ్గరపడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అంతటా పండుగ ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెద్ద పండుగ కావడంతో ప్రయాణికుల రద్దీని సొమ్ము చేసుకునేందుకు, అధిక చార్జీలు వసూలు చేసేందుకు ప్రైవేటు ట్రావెల్స్ సిద్ధమవుతున్నాయి.

ప్రయాణికుల సేవలో ఆర్టీసీ

ఒకవైపు ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తుంటే, మరోవైపు ఆర్టీసీ లాభనష్టాలతో ప్రమేయం లేకుండా, వారి సేవే పరమావధిగా అడుగులు వేస్తోంది. సంక్రాంతి, దసరా, దీపావళి, ఇతర ఉత్సవాల సమయంలో కూడా డిమాండును బట్టి ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. వరుస సెలవులు వచ్చే పండుగల్లో సంక్రాంతికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఈ పండుగ వేళ దూర ప్రాంతాలకు ప్రయాణించే వారిపై గతంలో మాదిరి గానే అదనపు భారాన్ని మోపకుండా సాధారణ చార్జిలతో ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. రాను, పోను ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్ బుక్ చేసుకుంటే చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్రాంతికి స్పెషల్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ఆరు డిపోల నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం 240 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ, బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, విశాఖపట్టణం, తిరుపతి తదితర పట్టణాలకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు.

- ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, సుఖవంతమనే నమ్మకంతో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 30-50 శాతం ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికులపై అదనపు చార్జీల భారాన్ని మోపేవారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశాక ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రయాణికులపై పైసా అదనపు భారం వేయకుండా ప్రభుత్వం ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో నడుపుతుండడం విశేషం.

ప్రత్యేక సర్వీసులు

పెద్ద పండుగ నేపథ్యంలో కడప రీజియన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభించనుంది. ఇందులోభాగంగా హైదరాబాద్‌కు 90, బెంగుళూరు 80, విజయవాడ 30, చెన్నై 10, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురానికి 30 ప్రత్యేక సర్వీసులు కలిపి మొత్తం 240 సర్వీసులు నడపనున్నారు. ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని అదనపు సర్వీసులను సైతం నడిపేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.అలాగే అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నుంచి 3 విజయవాడ, 2 బెంగళూరు, రాయచోటి డిపో నుంచి విజయవాడ 6, బెంగళూరు 2, చెన్నై, హైదరాబాద్‌కు ఒక్కొక్కటి చొప్పున నడపనున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు తెలిపారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి

సంక్రాంతి పండుగ వేళ బంధువులు, స్నేహితులకు సంక్రాంతి కానుకలను పంపుకునేందుకు తక్కువ చార్జీతో ఆర్టీసీ కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాకు చెందిన దూర ప్రాంతాల్లో ఉంటున్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

10 నుంచి బస్సుల రాకపోకలు



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, చెన్నై, విశాఖపట్టణం తదితర నగరాలతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 240 ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నాం. ఈనెల 10వ తేదీనుంచి ఈ సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి. – పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

క్లుప్తంగా

ఈఆర్‌ఓ రామమోహన్ సస్పెన్షన్



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం.రామమోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రామమోహన్ ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కొంతకాలంగా పనిచేస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పలు పోలింగ్ కేంద్రాల్లో మృతుల ఓట్లు తొలగించలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఈఆర్‌ఓను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకుంది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వల్లూరు : మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె సమీపంలో అంబవరం వెళ్లే దారికి పక్కన గల ముళ్లపొదల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గురువారం సాయంత్రం తోళ్లగంగనపల్లె సమీపంలోని ముళ్లపొదల నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని పురుషుని మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 5 నుంచి 6 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మృతుడు సుమారు 70 నుంచి 80 ఏళ్లలోపు ఉండవచ్చని భావిస్తున్నారు. కమలాపురం సీఐ రామక్రిష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మనస్థాపంతో వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. నల్లగుట్టపల్లెకు చెందిన వేణు భార్య నందిని (26) కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి మనస్థాపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

గాలికుంటు నివారణకు టీకాస్త్రం

- 4 నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా తప్పనిసరి
- జిల్లాలో ప్రారంభమైన గాలికుంటు నివారణ వ్యాధి టీకా
- ఈనెల 31వరకు జిల్లాలో కొనసాగనున్న కార్యక్రమం





నోటి నుంచి కారుతున్న చొంగ, టీకా కార్యక్రమాన్ని ఖాజీపేట మండలం ఆంజనేయకొట్టాలు గ్రామంలో ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లాలో వ్యవసాయం తరువాత అంతటి ప్రాధాన్యం ఉండేది పాడి పరిశ్రమే. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబంలో తప్పనిసరిగా పాడి పశువులు, కలిగి ఉంటారు. వీటికి సీజన్‌వారీగా పలు వ్యాధులు దాడి చేస్తుంటాయి. ముఖ్యంగా పశువులకు ఈ సీజన్‌లో వైరస్ ద్వారా వ్యాపించేది గాలికుంటు వ్యాధి. ఈ వ్యాధిని అడ్డుకట్ట వేయడానికి తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాను వేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ప్రతి రైతుకు తమకు సంబంధించి నాలుగు నెలలు దాటిన పశువులు, ఆవులు, ఎద్దులకు టీకాలు వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనుంది.

జిల్లాలో పశువుల వివరాలు ఇలా...

వైఎస్సార్‌జిల్లాలో పశువులు, ఎద్దులను 1,09,900 కుటుంబాలు కలిగి ఉన్నాయి. ఈ కుటుంబాల పరిధిలో పశువులు,ఎద్దులు కలిసి 4,44,560 ఉన్నాయి. అలాగే గొర్రెలు, మేకలు 25,600 కుటుంబాలు కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 13,46,266 గొర్రెలు, మేకలు కలిగి ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం పశు వైద్యశాఖ ద్వారా ఉచితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ఆయా పశువుల ఆసుపత్రుల పరిధిలో ఆయా పశు వైద్యాధికారులు పశువులకు 400700 డోసుల వ్యాధి నిరోధక టీకాలు వేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

- గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో వేడి అధికమై వాటికి జ్వరం సోకి శూలు పశువుల్లో గర్భం విఫలమయ్యే అవకాశం ఉంటుంది.
- గాలికుంటు వ్యాధి సోకిన పశువులు, ఆవుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. అలాగే నోరు, మూతి, కాళ్ల గిట్టెలో పుండ్లు రావడం జరుగుతుంది. నోటి నుంచి విపరీంగా నురగ రావడం కనిపిస్తుంది. ఈ లక్షణాలు ఉంటే గాలికుంటు వ్యాధి సోకినట్లుగా గుర్తించి వైద్యులను కలవాల్సి ఉంటుంది.
- ఈ వ్యాధి సోకితే పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గి జ్వరం కూడా వస్తుంది. దాని తీవ్రత 104 నుంచి106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు పెరిగి పశువులు నీరసిస్తాయి. ఎద్దులకయితే పని చేసే సామర్థ్యం తగ్గిపోతుంది.
- నోటిలోపల పైపొర, పళ్లు, చిగుళ్లు, నాలుక, లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడుతుంది. దీంతో పశువులు, ఆవులు, గేదెలు మేత తినకుండా నోటి నుంచి చొంగ కారుతుంది. దీంతో అవి నీరశించి పోయే అవకాశం ఉంటుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశం కూడా ఉంటుంది. పొదుగుపై బొబ్బలు ఏర్పడుతుంది. దీంతోపాటు పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ ఎండ వేడికి తట్టుకోలేక నీరసిస్తాయి.

వ్యాధి వ్యాప్తి చెందే విధానం..

పశువుల లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి వల్ల వ్యాధి మిగతా పశువులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చేందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఒక చోటి నుంచి మరో చోటకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఫలితంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంది.

నివారణ చర్యలు ఇలా...

- పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్‌ను రక్తంలోకి ఎక్కించాలి. నోటిలో పుండ్ల వల్ల మేత సరిగా మేయవు. కాబట్టి వారికి శక్తి నిచ్చి సులభంగా అరిగే పదార్థాలో కూడిన ఆహారాన్ని అందించాలి.
- కాలి గిట్టల మధ్య పండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

టీకాల కార్యక్రమం ప్రారంభం



జిల్లాలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 2వ తేదీ ప్రారంభించాం. ప్రతి పాడి రైతు నాలుగు నెలలు వయసుపై బడిన ఆవులు, గేదెలకు ప్రభుత్వం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఉచితంగా వేస్తున్నారు. ఫలితంగా పశువులు, ఆవులకు ఈ గాలికుంటు వ్యాధి అదుపు చేసే అవకాశం ఉంటుంది. పాడి రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శారదమ్మ, పశుసంవర్థశాఖ జిల్లా అధికారి.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

కలికిరి : భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలికిరి మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మధుసూదనాచారి కథనం మేరకు ... మండలంలోని పత్తేగడ గ్రామం బాలయ్యకుంటవడ్డిపల్లికి చెందిన బి.అమరనాథ(37) అప్పులు చేసి టమాటా పంట సాగు చేశాడు. పూర్తిగా నష్టం వచ్చింది. దీంతో పాటు అమరనాథ మద్యానికి బానిసై బుధవారం రాత్రికి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో 'మద్యానికి అలవాటు పడితే అప్పులు తీర్చడం ఎలా' అంటూ భార్య నిలదీసింది. దీంతో మనస్తాపానికి గురైన అతను గదిలోని ఫ్యానుకు చీరతో ఉరి వేసుకున్నాడు. కొంత సేపటి తరవాత గమనించిన భార్య పిల్లలు కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వరుస చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

- సీసీ పుటేజీల ఆధారంగా ఏడుగురిని పట్టుకున్న పోలీసులు
- రూ.21.87లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు స్కూటర్లు, ఒక కారు స్వాధీనం



పోలీసులు అదుపులో చోరీ కేసులో పట్టుబడిన నిందితులు

రాయచోటి టౌన్ : వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ, పెద్దమండెం, తంబళ్లపల్లె, కలకడ, వాయిల్పాడు, లక్కిరెడ్డిపల్లె మండలాల పరిధిలో ఇళ్లలో చోరీలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ చోరీలు అన్నీ ఒక పద్ధతిలో జరగడంతో పాటు ఇళ్లకు కన్నాలు వేసి మరీ చోరీలకు పాల్పడినట్లు ఆధారాలు కనిపించాయని తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకొని తమ సిబ్బంది దర్యాప్తు చేపట్టారని తెలిపారు. ఆయాప్రాంతాలలో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా ఆ ప్రదేశాలలో సంచరించిన వ్యక్తులు ఈ ప్రాంతానికి కొత్తగా కనిపించడంతో పాటు అనుమానితులుగా కనిపించారని తెలిపారు. తమ దర్యాప్తులో వీరంతా తమిళనాడు వాసులుగా గుర్తించి.. చాకచక్యంగా పట్టుకున్నారని వివరించారు. పట్టుబడిన వారిలో కార్తీకేయన్, మోహన్ రాజ్, శక్తీవేల్, మురళి, దినగరన్, తిరుపతి, వెంకటేష్ చిన్నపయన్ వీరందరూ తిరువనంతపురం ప్రాంతానికి సమీప ప్రాంతాలలో నివాసం ఉండేవారని చెప్పారు.

గస్తీ కాసి.. చోరీ చేసి..

పట్టుబడిన నిందితులు తాపీ మేస్త్రీ వృత్తిగా జీవనం సాగిస్తూ ఉంటారని వివరించారు. క్రమంగా వీరు చెడు అలవాట్లకులోనై దొంగతనాలకు పాల్పడటం నేర్చుకున్నారన్నారు. ముందుగా ఆ వీధిలో కారులో కానీ స్కూటర్లలో కానీ తిరుగుతారు.. ఆ ప్రాంతంలో ఇళ్లకు తాళాలు వేసి ఉన్నట్లు గుర్తించి ఆ ప్రాంతానికి చేరుకొని ఇంటికి వెనుకవైపున గునపాలతో గోడను తవ్వేస్తారు. ఆపై ఎంచక్కా లోపలికి వెళ్లి డబ్బు, బంగారు, వెండి వంటి విలువైన వస్తువులు దోచుకెళ్తారని వెల్లడించారు. వారి వద్ద నుంచి 9 కేసులకు సంబంధించి 437.76 గ్రాముల బంగారు ఆభరణాలు, 417 వెండి ఆభరణాలు, రెండు స్కూటర్లు, ఒక కారు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీటి విలువ సుమారు రూ.21,87,500లు ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ కేసుల దర్యాప్తులో రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, వాయిల్పాడు సీఐ సురేష్ కుమార్, గుర్రకొండ ఎస్ఐ పి. దిలీప్‌కుమార్, ఏఎస్ఐ మోసేస్, హెడ్‌కానిస్టేబుల్ జగదీష్, హోంగార్డు రాఘవ, టెక్నికల్ హెన్నికల్ హెడ్ కానిస్టేబుల్ రవి, అబ్దుల్లా బాగా కృషి చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 80 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం యర్రగుంట్ల పట్టణంలోని 11వ వార్డుకు చెందిన మాజీ కో–ఆప్షన్ సభ్యురాలు జిగినీ బాను, జిలానీబాషా, రహంతుల్లాలతో పాటు 80 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరందరికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు నాయకులు యూసోఫ్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నవశకం



కొత్త ఇంట్లో చేరాం



గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్లు కావాలని ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నాం. అయినా మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇళ్లు మంజూరవుతున్నాయని వలంటీర్ చెప్పారు. సంబంధిత పత్రాలను ఇచ్చారు. పనులను ప్రారంభించి పూర్తి చేసుకున్నాం. బిల్లులు కూడా సకాలంలో వచ్చాయి. ప్రస్తుతం సొంత ఇంట్లో చేరాం. చాలా సంతోషంగా ఉంది.ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

– దుర్గ లక్ష్మి, గాదెగూడూరు గ్రామం, రాజుపాలెం మండలం.

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్‌లు



వైఎస్సార్ చేయూత పథకానికి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవాళ్లం, కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను తయారు చేయించి అధికారుల ద్వారా తనకు సర్టిఫికెట్లను ఇప్పించారు. సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– నల్లగొండు వెంకటరమణమ్మ, శివాలయం వీధి, భాకరాపేట, సిద్దవటం.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కనకయ్య శెట్టి అనే వ్యక్తిని సీఐ కె. రామచంద్ర, ఎస్ఐ పి. ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 2000 విలువైన 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

కడప నగరంలోని సాయిపేటలోని ఆటో స్టాండ్ వద్ద బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఆనంద్ శ్రీనివాసులును ఎస్ఐ సంజీవరాయుడు, తమ సిబ్బందితో గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గతేడాది డిసెంబర్ 15వ తేది జరిగిన హత్యకేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హత్య కేసు వివరాలను ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావుతో కలిసి వెల్లడించారు. రాచగుడిపల్లె ఎస్సీ కాలనీలో నివాసముంటున్న రామయ్య తన భార్య కృష్ణవేణి తన అన్న అందె సుబ్బరాయుడుతో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో 2023 డిసెంబర్ 15వ తేది అర్ధరాత్రి రోకలితో తలపై కొట్టి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణవేణి తిరుపతిలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చికిత్సపొందుతూ అదే నెల 30వ తేది చనిపోయింది. ఈ క్రమంలో పరారిలో ఉన్న భర్త అందె రామయ్యను మండల పరిధిలోని కుడుమలూరుకు పోయే మార్గంలో ఉన్న రాచగుడిపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు వివరించారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

బి.కొత్తకోట : వ్యక్తిపై దాడిచేసిన కేసులో ఇద్దరు నిందితులకు మదనపల్లె కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చిందని స్థానిక స్టేషన్‌హౌస్ ఆఫీసర్ ప్రశాంత్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు... కురబలకోట మండలం చెన్నామర్రిమిట్టకు చెందిన ఎస్.రెడ్డిశేఖర్ (35) బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ శీతివారిపల్లెలో ఉంటున్న మామ ఎస్.శివారెడ్డి, భార్యపై 2021లో దాడి చేశాడు. స్థానికుడైన ఎస్.చిన్నరెడ్డప్పతో కలిసి దాడికి పాల్పడినట్టు బాధితుడు శివారెడ్డి ఫిర్యాదుపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం మొదటి ముద్దాయి రెడ్డిశేఖర్‌కు 9 నెలల జైలు, రూ.2,500 జరిమానా, రెండో ముద్దాయి ఎస్.చిన్నరెడ్డెప్పకు 8 నెలల జైలు, రూ.1,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ప్రశాంత్ తెలిపారు.

మఠం.. ఉత్సవ శోభితం



విద్యుద్దీప అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవి మఠం



అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

- వైభవంగా శ్రీ ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- ఘనంగా ఏర్పాట్లు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. ఆరాధనోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఈశ్వరీదేవికి విశేష పూజలు చేశారు. ఉదయం ప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలుపెట్టారు. బ్రహ్మంగారిమఠం మండలం చౌదరివారిపల్లెకు చెందిన శ్రీ సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన భజన భక్తులను అలరించింది. బ్రహ్మంగారి మఠం మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన శ్రీ అచలానందస్వామి కోలాట బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారు అశ్వవాహనంపై ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. సాయంత్రం సూక్తపారాయణం, అభిషేకం చేశారు. రాత్రి హంస వాహనోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మఠాధిపతి శ్రీ వీరశివ కుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయ శాఖ, మఠం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఈశ్వరీమాత సేవా సమితి ట్రస్టు చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన వేడుక

శ్రీఈశ్వరీదేవి 1789లో మార్గశిర బహుళ నవమినాడు సజీవ సమాధి నిష్ట వహించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బహుళ నవమి (శుక్రవారం) ప్రధాన వేడుక నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పిస్తారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఇందులో మఠాధిపతి దంపతులు పాల్గొంటారు.

విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలి

మోటివేటర్ వీరశెట్టి సంధ్య



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మోటివేటర్ వీరశెట్టి సంధ్య

మైదుకూరు : విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోర్ కమిటీ డైరెక్టర్, ప్రపంచ సైకాలజిస్టుల సమాఖ్య సభ్యురాలు, మోటివేటర్ వీరశెట్టి సంధ్య అన్నారు. గురువారం మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలా చదవాలి, పాఠ్యాంశాలను ఎలా గుర్తు పెట్టుకోవాలనే విషయాలపై ఆమె మాట్లాడారు. చాలా మంది విద్యార్థులు భయంగా ఉంటుందని.. గణితం అంటే ఇష్టం ఉండదని పేర్కొన్నారు. వారికి ప్రాథమిక దశలో బేసిక్స్ నేర్పకపోవడం వల్లే గణితంపై ఆ విధమైన అ ఇష్టం ఏర్పడుతుందన్నారు. ప్రతి మనిషి మైండ్‌కు ఒక భాష ఉంటుందని, మనం చదివే విషయాలను ఫొటో, వీడియో ఫార్మేట్‌లో నిక్షిప్తం చేసుకుంటుందని అన్నారు. దాన్ని అనుసరించి చదివితే చదివినంతా తప్పక గుర్తుంటుందని తెలిపారు. పదో తరగతి పరీక్షలు దగ్గరలో ఉన్నందున విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను ఏ విధంగా గుర్తు పెట్టుకోవాలనే విషయంపై ఆమె వివరించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా మోటివేట్ చేసినందుకు పాఠశాల హెడ్మాస్టర్ రమాదేవి మోటివేటర్ సంధ్యను అభినందించారు. కార్యక్రమంలో మోటివేషనల్ ట్రైనర్ పసుపులేటి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.